



ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోండి

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ పోలీసు సిబ్బందికి మొబిలైజేషన్‌లో భాగంగా ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. బుధవారం ఫైరింగ్ ప్రాక్టీసులో ఎస్పీ పాల్గొన్నారు. ఏకే 47, మసాడా, గ్లాకోపిస్టల్ ద్వారా ఎస్పీ ఫైరింగ్ సాధన చేశారు. వజ్ర వాహనం నుంచి గ్యాస్‌షెల్స్ ఫైరింగ్ చేసి పరిశీలించారు. ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు. అధికారులు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీగా కిరణ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్/కలికిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా 'మెప్మా' ప్రాజెక్ట్ డైరెక్టరుగా డిప్యూటీ కలెక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక ఏడాది గడువుతో డెప్యుటేషన్ ప్రాతిపదికన ఈ నియామకం చేశారు. గతంలో నెల్లూరు జిల్లా తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం బదిలీ చేస్తూ తదుపరి పోస్టింగు కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ఎదుట హాజరు కావలసిందిగా ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయనను జిల్లా మెప్మా పీడీగా నియమిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పీడీగా ఉన్న వై.సురేశ్‌రెడ్డిని తన మాతృసంస్థ అయిన ఖజానా శాఖకు బదిలీ చేశారు.

వర్రా కేసులో పోలీసుల దూకుడు

- నేడు విచారణకు రావాలంటూ ఆరుగురికి నోటీసులు

పులివెందుల టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో పెట్టిన అసభ్య పోస్టులకు సంబంధించి అరెస్టు అయిన వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డి కేసులో పోలీసులు దూకుడు పెంచారు. గురువారం కడప డీటీసీ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని విశాఖ, విజయవాడకు చెందిన ఆరుగురికి 41-ఏ నోటీసులు జారీ చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ తెలిపారు. ఈ కేసు విచారణను మరింత వేగవంతం చేసేందుకు ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారన్నారు. ఈ టీంలో అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు, పులివెందుల డీఎస్పీ మురళి, జమ్మలమడుగు సీఐ లింగప్ప, ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ రామక్రిష్టారెడ్డి, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో 41-ఏ నోటీసులు 28 మందికి ఇచ్చామని, 78 మందికి పీటీ వారెంటు జారీతో పాటు ముగ్గురిని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. త్వరలో విచారణ పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

రిమ్స్‌లో సదరం వెరిఫికేషన్




కడప సెవెన్‌రోడ్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) ప్రాంగణంలో ఉన్న మానసిక వ్యాధుల ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ నెల 27 నుంచి మొదలైన ఈ శిబిరం జూలై వరకు కొనసాగనుంది. ఇక్కడ దాదాపు 12 వేలమందికి పైగా బుద్ధిమాంద్యం, విజువల్ ఇల్‌నెస్, హ్యాండీక్యాప్డ్ తదితరుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 2006, 2007లో మాన్యువల్ ద్వారా, 2008, 2009లో ఆన్‌లైన్ ద్వారా సదరం సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయని కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా అనంతపురం, నెల్లూరు నుంచి డాక్టర్లను రప్పించి రిమ్స్ ప్రాంగణంలో సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తున్నారు. బుధవారం పెద్దఎత్తున దివ్యాంగులను తీసుకుని వాటి కుటుంబసభ్యులు రిమ్స్ వద్దకు చేరుకున్నారు.

ఫ్రీహోల్డ్ భూములకు బ్రేక్

- జగన్ సర్కారులో భూ దందాలపై విచారణ
- ప్రభుత్వ భూములు కట్టబెట్టిన అధికారుల గుట్టురట్టుకు యత్నాలు
- క్లీన్‌చిట్‌కు రెండు నెలల గడువు
- అప్పటి దాకా 76 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకే

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల చిక్కుముడి వ్యవహారం ఇప్పట్లో వీడేటట్లు లేదు. జగన్ సర్కారులో చోటుచేసుకున్న ఫ్రీహోల్డ్ భూముల అక్రమదందాలు తవ్వేకొద్దీ ఒక్కొక్కటిగా బయట పడుతుండడంతో అధికారులకు మైండ్ బ్లాక్ అవుతోంది. అప్పట్లో వైసీపీ నేతల కోసమే అన్నట్లుగా జారీ చేసిన లోపభూయిష్టమైన జీవో వైసీపీ నేతల దురాశకు కారణమని, పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను కాజేసే కుట్రసాగిందనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో దాదాపు 76,275 ఎకరాల ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ఫ్రీహోల్డ్ భూములుగా గుర్తించారు. అందులో 9,004 ఎకరాల ప్రభుత్వ భూములకు ఫ్రీహోల్డ్ పేరుతో క్లీన్‌చిట్ ఇప్పించేందుకు అధికారం ముసుగులో పెద్ద కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో బద్వేలు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను వైసీపీ నేతలు మేనేజ్ చేసి అడ్డగోలు భూ దందాలకు తెరలేపిన విషయాలు బయటపడుతున్నాయి.




ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలోనూ హడావిడే..

కడప కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.36 లక్షల ఎకరాలు ఉండగా.. ఇందులో 70 వేల ఎకరాల వరకు నిషేధిత భూముల జాబితాలో పెట్టడం చూస్తే ప్రభుత్వ భూములను గోల్‌మాల్ చేసే కుట్ర ఏ స్థాయిలో జరిగిందో ఊహించవచ్చు. మళ్లీ ప్రభుత్వం మనదే అన్న ధీమాతో కొందరు వైసీపీ నేతలు, అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఫ్రీహోల్డ్ చేయడం, కడప పరిధిలో కొన్ని భూములను అసైన్డ్ చేయడం, చుక్కల భూములకు క్లీన్‌చిట్ ఇవ్వడం లాంటి కుట్రల్లో అందరూ భాగస్వాములే అనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తప్పుడు విధానాలకు తోడ్పాటు అందించడంలో జిల్లావ్యాప్తంగా కొందరు తహశీల్దార్ల పాత్ర కీలకంగా కనిపిస్తోంది. ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన భూ బాగోతం తేల్చే పనిలో చంద్రబాబు కూటమి సర్కారు కసరత్తు ముమ్మరం చేసింది. 6 నెలలుగా ప్రయత్నిస్తున్నా ఫ్రీహోల్డ్ భూముల లెక్కలు తేల్చలేకపోయింది. నిజమైన భూహక్కు దారుల జాబితాను పారదర్శకంగా ప్రకటించేందుకు సిద్ధమైంది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు ఫ్రీహోల్డ్ భూముల్లో ఇన్నాళ్లు జరిగిన అవకతవకలు తేల్చే పనిని అప్పగించారు. వ్యూహాత్మకంగా జీవో రాక ముందే పేదల నుంచి, ప్రభుత్వం నుంచి నయానో భయానో లాక్కున్న భూముల చిట్టా విప్పేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాను కూడా రంగంలోకి దించింది. పూర్తి స్థాయిలో పరిశీలన జరిగితే జగన్ సర్కారులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల గుట్టురట్టు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరో 2 నెలల పాటు ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా బ్రేక్‌వేస్తూ నిషేధిత జాబితా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ వచ్చీరాగానే రిజిస్ట్రేషన్లలో అక్రమాలు సాగాయి. అధికారపార్టీ నేతలు రిజిస్ట్రేషన్ అధికారులను బెదిరించి అప్పట్లో ప్రభుత్వ భూములను అడ్డ గోలుగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు వచ్చాక స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆదేశాల మేరకు మైదుకూరులో అక్రమ రిజిస్ట్రేషన్లు నిగ్గుతేల్చేందుకు అప్పట్లో కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లును ప్రొసీడింగ్ అధికారిగా నియమించారు. దాదాపు 125 రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగాయని గుర్తించారు. వాటన్నింటినీ రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ల గోల్‌మాల్ వ్యవహారంలో అప్పటికే పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు చేసిన మహిళా సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అంతేకాకుండా మైదుకూరులో ఫ్రీహోల్డ్ భూములపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన విచారణలో మైదుకూరు తహశీల్దారు కార్యాలయంలో 14 మంది సిబ్బందికి కలెక్టరేట్ అధికారులు నోటీసులు జారీచేసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని తప్పుడు అధికారులకు ముచ్చెమటలు పట్టించారు. ఇన్నాళ్లు పేదలను మభ్యపెట్టి ప్రభుత్వ భూములను చవకగా కొట్టేసిన పెద్దల భాగోతంతో పాటు అవినీతి అధికారుల చిట్టాలు మరో 2 నెలల్లో బట్టబయలు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

1-బీ, అడంగల్ ఉంటే చాలు.. ఫ్రీహోల్డ్‌కు క్లీన్ చిట్..!



20 ఏళ్ల దాటిన ప్రభుత్వ భూములకు ఫ్రీహోల్డ్ భూములుగా ప్రకటిస్తూ అప్పట్లో జగన్ సర్కార్ జీవో జారీ చేసింది. ఈ జీవోకు భూముల పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేదు. కేవలం 1-బీ, అడంగల్‌లో ఎవరి పేరు ఉంటే వారే భూములకు రారాజు అనే విధంగా ఉండడం వైసీపీ నేతలకు వరంగా మారింది. ఫ్రీహోల్డ్ భూముల జీవో రానున్న విషయం ముందే తెలుసుకోవడంతో.. వైసీపీ నేతల భూ అక్రమదందాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని చెప్పవచ్చు. రెవెన్యూలో లొసుగులను ఔపోశన పట్టిన తహశీల్దార్ల సాయంతో పేదల ఫ్రీహోల్డ్ భూముల జాబితా పక్కన పెట్టుకుని కమర్షియల్‌గా కోట్లు వచ్చే ఖరీదైన భూములను టార్గెట్ చేశారు. పేదలకు పదో, పరకో ఇచ్చి నయానో భయానో అగ్రిమెంట్లతో వేలాది ఎకరాలను జీవో రాక ముందే కొల్లగొట్టారనే విషయం అప్పట్లో హాట్ టాపిక్ అయింది. జీవో వచ్చీరాగానే వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్ నుంచి తప్పించి ప్రభుత్వానికి టోకరా కొట్టినట్లు తెలుస్తోంది. తహశీల్దార్ల సహకారంతో జిల్లాలో దాదాపు 9,004 ఎకరాల వరకు అక్రమంగా వైసీపీ నేతలు దోచుకున్నట్లు ఇప్పటికే తేలిందని సమాచారం. ఇదే నిజమైతే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల్లో జరిగిన తప్పొప్పులను లెక్కించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలుస్తోంది.

తెలుగు లోగిళ్లకు కల్యాణ శోభ

- రాబోయే ఐదు నెలలు ముహూర్తాల సందడి
- నేటి నుంచి మాఘమాసం ప్రారంభం



కలికిరి/కడప కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో తెలుగు లోగిళ్లు కల్యాణ శోభను సంతరించుకోనున్నాయి. ఆ తరువాత ఫిబ్రవరి మొదలు జూన్ నెల వరకూ ప్రతి మాసంలోనూ అనుకూలమైన విధంగా ముహూర్తపు గడియలు అందుబాటులో ఉండనున్నాయి. గత సంవత్సరం ముహూర్తాలు తక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు అంతంతమాత్రంగానే జరిగాయి. అయితే నవంబరు నెలలో ఊపందుకున్నాయి. ఈ ఏడాది ఐదు నెలలపాటు ముహూర్తాలకు కొదవలేదని పండితులు చెపుతున్నారు. ఫిబ్రవరిలో ఏకంగా 12రోజులపాటు ఊపిరి సలపని ముహూర్తాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నిశ్చితార్థాలు పూర్తి చేసుకున్నవారు ఆహ్వానపత్రికల పంపకాలతో హడావిడి మొదలు పెట్టేశారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తదితర శుభకార్యాలతో ఎటు చూసినా సందడి నెలకొనబోతోంది. దివ్యమైన ముహూర్తాలకు ఈ ఏడాది కొదవలేదని పంచాంగకర్తలు చెబుతున్నారు. ఆ తరువాత మార్చిలో ఐదు రోజులు, ఏప్రిల్‌లో 9రోజులు, మే నెలలో 7 రోజులు, జూన్‌లో నాలుగు రోజులపాటు శుభ లగ్నాలకు కొదవ లేదని అంటున్నారు. శుభ ముహూర్తాల సందడి కారణంగా కల్యాణ మండపాలు, మంగళ వాయిద్యకారులు, అలంకరణకారులు, పూలు, బట్టలు, బంగారు వ్యాపారులు, పురోహితులకు కూడా పంట పండనుంది. రిటైల్, హోల్‌సేల్ కిరాణా వ్యాపారులకు చేతినిండా అమ్మకాలు సాగనున్నాయి. టెంట్ డెకరేషన్‌లు, క్యాటరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, బ్యూటీపార్లర్లు, ఫొటోగ్రాఫర్లు ఇలా ఒక్కరేమిటి అన్ని రంగాల్లో లావాదేవీలు ఊపందుకోనున్నాయి. ఏదేమైనా చాలా కాలం తరువాత వరుస ముహూర్తాలు రావడం, అనుకూలమైన గడియలు అందుబాటులో ఉండటం ఈ ఏడాది విశేషంగా చెబుతున్నారు.



పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష
- చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు

6

హాకీలో కడపకు ద్వితీయ స్థానం
- ముగిసిన రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు

7

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- ప్రారంభమైన దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
- శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ అశోక్‌కుమార్



దేవునికడప వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు చేపట్టిన ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న కడప కోనేటిరాయుడు



వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజలు



దేవేరులతో కలసి ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన వేంకటేశ్వరుడు

కడప కల్చరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, క్రిష్ణమోహన్, సాయి, కృష్ణమూర్తి, తరుణ్ శాస్త్రోకంగా పఠించిన వేద మంత్రాల నడుమ ఉదయం 9-30 నుంచి 10-30 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణం అత్యంత భక్తిశ్రద్ధలతో గావించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. ధ్వజారోహణం తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. కాగా.. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్ బుధవారం దేవుని కడప శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, స్వామివారు ఊరేగింపుగా తిరుగాడే మాడవీధులను పరిశీలించారు. రథసప్తమి రోజున తీసుకోవాల్సిన కట్టుదిట్ట భద్రత గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కడప రాయుడిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఊరేగింపులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చంద్రప్రభ వాహనంపై తిరుమలేశుడు

రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకూ ఏడుకొండలస్వామి దేవేరులతో కలిసి చంద్రప్రభ వాహనంపై తిరువీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు సాయంత్రం 6 గంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఆలయంలో అన్నమాచార్య కీర్తనలు కడు రమ్యంగా ఆలపించి భక్తులను ఆనందసాగరంలో తేలియాడేలా చేశారు. 7 గంటలకు హరికథ కార్యక్రమంతో భక్తులను అలరించారు. కోలాట బృందం కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

దోపిడీకి నిలయం వైసీపీ

- రూ.పదిలక్షల కోట్లు అప్పు చేసి ప్రజలపై పెనుభారం
- జల్సాలకే రూ.19వేల కోట్లు ఖర్చు చేసిన జగన్
- టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దోపిడీకి వైసీపీ ప్రభుత్వం నిలయమని.. ఐదేళ్లపాలనలో పదిలక్షల కోట్లు అప్పు చేసి ప్రజలపై పెనుభారం పెట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు జగన్ 20 వేల కోట్లు బకాయిలు పెట్టారని, టిడ్కో ఇళ్లకు రంగులు పూసుకున్నారు తప్ప పూర్తిచేసి ప్రజలకు ఇవ్వలేదన్నారు. కేవలం జగన్ జల్సాలకు వినోదాలకే ప్రభుత్వ సొమ్మును రూ.19 కోట్ల 870 లక్షలు, కుటుంబ సభ్యుల ప్రయాణాలకు రూ.22 కోట్లు ఖర్చు చేశారన్నారు. రేషన్ బియ్యంతో సహా దోపిడీ చేశారన్నారు. సర్వే రాళ్లపై కూడా తన బొమ్మలు వేసుకున్నారన్నారు. కేవలం మద్యం షాపుల్లో ఎలుకలు పట్టడానికే రూ.కోటి 36లక్షలు ఖర్చు చేశారంటే ఏ మేరకు నిధులు దోపిడీకి గురయ్యాయో అర్థం అవుతుందన్నారు. అసైన్డ్ భూముల దోపిడీ, ఇసుక దోపిడీ ఇలా ప్రతి ఒక్కదానిలో దోపిడీకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ.. వివిధ కంపెనీల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి సంపద సృష్టించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే గత ఐదు సంవత్సరాలుగా దోచుకున్న వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ అమలు చేశామని త్వరలో ఉచిత బస్సు, రైతు పెట్టుబడి నిధి, తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబం రాకతో పులివెందుల ప్రాంతంలో మట్కా జూదం పేట్రేగిపోయాయన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ రెడ్డితో సహా వైఎస్ కుటుంబ సభ్యులందరూ మట్కా బీటరు డానియల్‌తో ఫ్లెక్సీలు వేయించుకునే పరిస్థితికి దిగజారన్నారు. జగన్ క్యాంపు కార్యాలయం దారిలో మోకాళ్ల లోతు గుంతలు తవ్వడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. జలజీవన్ పనుల బిల్లులు బకాయిలు పెట్టడంతో ఆగిపోయాయని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బకాయిలు చెల్లించి మళ్లీ పనులు ప్రారంభమయ్యేలా చేశామన్నారు. ఇప్పటికైనా ఎంపీ అవినాశ్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి. చిత్రంలో బీటెక్ రవి

వసతులున్నా.. రోడ్లపైనే...

- వెలవెలబోతున్న రైతుబజార్
- వసతులు అధునాతనం
- రైతులు రాక.. వ్యాపారులు లేక...
- రూ.కోటి ప్రభుత్వ ధనం నిరుపయోగం
- 50 గదులున్నా ఇద్దరే వ్యాపారులు
- మార్కెటింగ్‌శాఖ అధికారుల ప్రయత్నాలు విఫలం
- ఇదీ రాయచోటిలో రైతు బజార్ దుస్థితి

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ నడిబొడ్డులో బస్టాండుకు అత్యంత సమీపంలో రూ.కోటి నిధులతో నిర్మించిన రైతు బజార్‌కు రైతులు రాక, వ్యాపారాలు లేక వెలవెలబోతోంది. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన నూతన రైతు బజార్‌లో వ్యాపారులు సౌకర్యార్థం 50 గదులు ఏర్పాటు చేసినప్పటికీ కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే అక్కడ వ్యాపారాలు చేస్తుండడంతో కొనుగోలుదాడులు రాకపోవడమే కాకుండా పంటలు పండించే రైతులు సైతం తాము పండించే కూరగాయలను రైతుబజార్‌కు తీసుకురాకపోవడంతో అక్కడ కూరగాయలు విక్రయిస్తున్న ఒకరిద్దరు వ్యాపారులు కూడా రైతు బజారు ముందు భాగంలో ఆరుబయటనే వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు నివాసాల నిర్మాణాలతో పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం అధునాతన రైతు బజారు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయలు వెచ్చించి గాలివీడు మార్గం నుంచి బస్టాండుకు వచ్చే రోడ్డు పక్కనే నూతన రైతు బజారును నిర్మించారు. రైతు బజారు నిర్మాణం పూర్తయిన అనంతరం 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారును ప్రారంభించగా అప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు రైతు బజారు బాగానే నడిచినప్పటికీ సంవత్సర కాలంగా కొనుగోలుదారులతో పాటు పంటలు పండించే రైతులు రైతుబజారుకు సక్రమంగా రాకపోవడంతో వ్యాపారాలు రోజు రోజు తగ్గిపోతూ వచ్చాయి. దీంతో అక్కడ వ్యాపారం చేసుకునే వ్యాపారులు ఒక్కొక్కరిగా రైతు బజారు నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపైన వ్యాపారాలు పెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా మిగిలిన ఒకరిద్దరూ మాత్రం రైతు బజారు ముందు భాగంలోనే ఆరుబయట రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో కోటి రూపాయలతో 50 గదులతో పాటు నాలుగు స్టాక్ రూములతో నిర్మించిన రైతు బజారు వెలవెలబోతోంది.

దళారుల మాయలో రైతులు

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలు తమ పంటలను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతుబజార్‌ను నిర్మించింది. కానీ రైతులు మాత్రం ఇక్కడకు రాకుండా పాత మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొంతమంది దళారుల చేత మోసపోతూనే ఉన్నారు. రైతులు పండించి మార్కెట్‌కి తీసుకొస్తున్న టమోటాలు, పచ్చిమిరపకాయలు, బెండకాయలు, వంకాయలు తదతర కూరగాయలను దళారులు, వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు మాత్రం ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అధికారులు పదేపదే చెబుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైతు బజారులో పంటలను విక్రయించుకుని లబ్ధి పొందాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వాటిని పట్టించుకోకుండా దళారులను నమ్మి మోసపోతున్నారు.



రైతుబజారు బయట గేటు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం



వీరభద్రస్వామి గుడి ఎదురుగా మార్కెట్‌లో రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు

రోడ్డుపైనే విక్రయాలు...

రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కూరగాయల వ్యాపారులు రైతు బజారులో కాకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన, డ్రైనేజీ కాలువలపైన, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రైనేజీలు ఆక్రమిస్తే మాకేంటి.. రోడ్లపైన వ్యాపారాలు చేస్తే మాకేంటి అన్న చందంగా అటు మున్సిపల్ అధికారులు, ఇటు ట్రాఫిక్ అధికారులు వ్యవహరిస్తుండడంతో పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా కోటి రూపాయలతో నిర్మించిన రైతుబజారు అత్యంత సౌకర్యవంతంగా అందుబాటులో ఉన్నప్పటికీ కొంత మంది వ్యాపారులు మాత్రం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో, డీఈవో కార్యాలయం ముందు భాగంలో, వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో, సుండుపల్లె రోడ్డులోని డ్రైనేజీపై, మార్కెట్‌వీధిలో రోడ్లపైన ఇలా ఎక్కడపడితే అక్కడ కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారు. కొనుగోలుదారుల వాహనాలు, ఆటోలు ఇలా రోడ్లపైన నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై జరుగుతున్న కూరగాయల విక్రయాలను నియంత్రించి ఖాళీగా ఉన్న రైతు బజారులోకి వ్యాపారులను తరలించి వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం

రాయచోటి పట్టణంలో ఉన్న రైతు బజారును వినియోగంలోకి తెచ్చేందుకు చాలా కష్టపడ్డాం. 2022 సంవత్సరం మార్చి నెలలో రైతు బజారు ప్రారంభించినప్పటి నుంచి రెండు సంవత్సరాల పాటు అక్కడ వ్యాపారాలు బాగానే జరిగాయి. ఇటీవల కాలంలో కొంతమంది రైతులు తాము పండించిన పంటలను అక్కడికి తీసుకురాకపోవడం, కొనుగోలుదారులు సరిగ్గా రాకపోవడంతో అక్కడ ఉంటున్న వ్యాపారులు గిట్టుబాటు కాలేదంటూ ఒక్కొక్కరే దూరమయ్యారు.

-నాగరాజు, ఏడీ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, రాయచోటి



రూ.కోటి నిధులతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజార్



రైతుబజార్‌లో అధునాతనంగా నిర్మించిన స్టాల్స్

వినియోగంలోకి తీసుకురావాలి



పట్టణ నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న రైతుబజారును వినియోగంలోకి తీసుకురావాలి. ఎంతోమంది రైతులు ఆరుగాలం కష్టపడి తాము పండించిన పంటలను దళారులు, వ్యాపారుల చేతిలో పెట్టి మోసపోతున్నారు. పట్టణంలోని వాహన దారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన జరుగుతున్న కూరగాయల వ్యాపారాలను రైతుబజారులోకి తీసుకొచ్చి కొనుగోలు దారులకు తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు లభించేలా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతు బజారులో రైతులకు, వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

-సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష

- చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు

రాయచోటిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో 2022 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో బుధవారం చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు 4 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీ బాలికను సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన కోటకొండ చరణ్, తిరుపతి పట్టణానికి చెందిన షేక్ హేమద్‌లు కిడ్నాప్ చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును దర్యాప్తు చేసిన మదనపల్లి టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారన్నారు. బుధవారం ఈ కేసు పూర్వాపరాలను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితులకు చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి నిందితులకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్షపడటంలో కృషి చేసిన స్పెషల్ పీపీ శైలజ, మదనపల్లి డీఎస్పీ కొండయ్యనాయుడు, మదనపల్లె టూటౌన్ సీఐ కె.రామచంద్ర, దర్యాప్తు అధికారి, ఎస్‌ఐ చంద్రమోహన్, మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌కే రహీముల్లా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ హరిబాబునాయక్, చిత్తూరు కోర్టు లైజర్ హెడ్ కానిస్టేబుల్, టీసీ సాయి సుధాకర్‌లను ఎస్పీ అభినందించారు.

బోర్డులు తొలగిస్తే కేసులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



సుండుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నాటిన బోర్డులు తొలగించిన వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లె, జగనన్న కాలనీ ఎదురుగా సర్వే నెంబర్ 2574-3లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం పేరిట నాటిన బోర్డు భూకబ్జాదారులు తొలగించారని కథనం రావడంతో ఆ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బోర్డు తొలగించిన ప్రదేశంలో ఇది ప్రభుత్వ స్థలం, ఇందులోకి అనుమతిలేకుండా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని తిరిగి బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో మట్టి తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో సంతోశ్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగంధం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, దుంగలతో ఫారెస్టు సిబ్బంది

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా 43 కేజీల శ్రీగంధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురు ప్రభాకర్ బుధవారం తెలిపారు. శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము మంగళవారం రాత్రి చిత్తూరు జిల్లా కల్లూరులో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు.

రాత్రి 11 గంటల ప్రాంతంలో పీలేరు వైపు నుంచి వచ్చిన టీఎన్-23 బీఈ 5179 నెంబరు గల ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు తాము ఆపినా ఆపకుండా సదుం వైపు వెళ్లిందన్నారు. ఆ కారును తాము వెంబడించగా అందులోని వ్యక్తి దానిని కల్లూరు ఎగువవీధి వద్ద ఆపి పారిపోయాడన్నారు. కారును తనిఖీ చేయగా 3 బస్తాలలో 43 కేజీలు బరువున్న శ్రీగంధం లభ్యమైందన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో తనతో పాటు ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది నందీశ్వరులు, సురేశ్ రాజు, సుబ్రహ్మణ్యాం, చరణ్ పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

591 కల్తీ మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీగా కల్తీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. అనంతరాజుపేటకు చెందిన ఎం.అయ్యప్ప, ఓబులవారిపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన వెంకటనారాయణ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించి 591 కల్తీ మద్యం సీసాలు, రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసులో ప్రధాన నిందితులైన తిరుపతివాసులు ఆర్.వెంకటరమణ, జయబాబు పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నామన్నారు. దాడుల్లో సీఐ ఎల్లయ్య, నీలకంఠేశ్వరరెడ్డి, తులసి, ఎస్‌ఐలు శశిధర్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ : ఒకరి మృతి

ఓబులవారిపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడపకు చెందిన రుద్రరాజు సుబ్రమణ్యం రాజు (46), అనంతరాజుపేటకు చెందిన రెడ్డెయ్యతో కలిసి బుధవారం రాత్రి కారులో కొర్లకుంట నుంచి కోడూరు వైపు వెళుతుండగా మండలంలోని మంగంపేట సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి గుడి సమీపంలో చెన్నై నుంచి పూణె వెళుతున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న సుబ్రమణ్యంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రెడ్డయ్యకు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి తిరుపతికి తరలించినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.ఈ సమాచారం తెలియడంతో ఎమ్మెల్యే శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.



కంటైనర్‌ను ఢీకొన్న కారు. కారులోనే మృతి చెందిన సుబ్రమణ్యంరాజు

డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు...

- కురబలకోటలో రెవెన్యూ లీల

కురబలకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు ఆ పార్టీకి చెందిన నేతలకు ఇష్టానుసారంగా డీకేటీ భూములను అప్పనంగా రాసిచ్చేశారు. కురబలకోటలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు పేదలకు చేయాల్సిన పనులు ఏమాత్రం చేయరు కానీ...పైసలిస్తే మాత్రం చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ భూముల్లో వ్యవసాయం చేసుకోవాలి. ఈ భూమి వారసత్వంగా తమ కుటుంబీకులకు సంక్రమిస్తుంది తప్ప ఇతరులెవ్వరికీ సంక్రమించదు. అంతేకాకుండా వంశపారపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు, ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా చేయకూడదు. కానీ చాలాచోట్ల 99 ఏళ్ల శాశ్వత కొనుగోళ్ల పేరుతో క్రయ, విక్రయాలు చేపట్టి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ తంతు చట్ట ప్రకారం చెల్లుబాటు కావన్న విషయం బహిర్గతమే. అయితే చట్టప్రకారం ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు.

కానీ ఇక్కడ పనిచేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఏమాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు. ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. భూముల ధరలు ఆకాశాన్నంటాయి.

కడప-మదనపల్లె రహదారిలోని తానామిట్ట వద్ద సర్వే నెంబర్ 1630లోని భూమి గత ప్రభుత్వ హయాంలో ఇసుక నిల్వలు చేయడానికి వినియోగించారు. అయితే ఈ భూమికి మహమ్మద్ అఫ్రిది పేరుతో 2159 ఖాతా నెంబర్‌లో విస్తీర్ణం 4 ఎకరాల భూమిని, ఇదే సర్వే నెంబర్‌లోని భూమిని శరీనాబీ పేరుతో 2198 ఖాతా నెంబర్ 25 సెంట్ల భూమిని అనువంశికం ద్వారా సంక్రమించినట్లు వన్‌బీ అడంగల్ హక్కును రెవెన్యూ అధికారులు కల్పించారు.



ముదివేడు సమీపంలోని తానా మిట్ట వద్ద భూమి

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు

ఈ భూములకు సంబంధించి గతంలో ఏమి జరిగిందో నాకు తెలియదు. ఎవరు పాసుపుస్తకాలు మంజూరు చేశారో నాకు తెలియదు. ఈ భూమికి సంబంధించిన విషయం నా దృష్టికి రాలేదు. ఒకవేళ వీటికి సంబంధించి ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాము.

- తపస్విని, తహసీల్దార్

పాడి రైతుల సమగ్రాభివృద్ధే 'హెరిటేజ్' లక్ష్యం

- పాడి రైతుల మహాసదస్సులో నారా భువనేశ్వరి



ప్రమాద బాధితులకు బీమా చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

పీలేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉత్పత్తులు, వినియోగదారుల సంతృప్తి, పాడి రైతుల సమగ్రాభివృద్ధే తమ సంస్థ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరులోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం జరిగిన పాడి రైతుల మహా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న చిత్తూరు జిల్లా పాడి రైతుల ఆదాయాన్ని పెంచి వారికి సుస్థిర అభివృద్ధిని కలగజేసేందుకు 32 ఏళ్ల క్రితం హెరిటేజ్ సంస్థను ప్రారంభించామన్నారు. ఏనాడూ రైతులకు ఆలస్యంగా చెల్లింపులు చేసిన దాఖలాలు లేవన్నారు. నేడు తమ సంస్థ ద్వారా దేశంలోని 9 రాష్ట్రాల్లో రోజుకు 9 వేల గ్రామాల నుంచి 200 చిల్లింగ్ యూనిట్ల ద్వారా 3 లక్షల మంది రైతుల దగ్గర నుంచి 18.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామన్నారు. 12 రాష్ట్రాల్లో తమ అమ్మకాలు సాగుతున్నాయన్నారు. డ్వాక్రా సంఘాల తరహాలో హెరిటేజ్ సంస్థలోనూ మహిళా పాడి రైతుల గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి విరివిగా రుణాలు అందిస్తున్నామన్నారు. కేవలం పాల సేకరణ తోనే సరిపెట్టకుండా అటు పాడికి, ఇటు రైతులకు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నాణ్యమైన పాడి ద్వారానే నాణ్యమైన పాలు సాధ్యమని నమ్మి పశుసంవర్ధక సేవలు కూడా అందిస్తున్నామన్నారు. గడిచిన ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వేయి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 12 వేల ఆవులకు ఉచితంగా వైద్యం అందించామన్నారు. హెరిటేజ్ ఫిన్‌లీస్ లిమిటెడ్ ద్వారా రైతులకు వారి పాల సరఫరా ఆధారంగా సాధారణ, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నామని, గత ఏడాది తమ సంస్థ ద్వారా రూ.139.11 కోట్ల రుణాలు అందజేయగా అందులో చిత్తూరు జిల్లా రైతులకు రూ.16.12 అందజేశామన్నారు. 'హెరిటేజ్ వెట్' అనే యూట్యూబ్ చానెల్ ద్వారా పశువుల ఆరోగ్యం, వ్యాధి నివారణ-నిర్ధారణ, సైలేజ్ తయారీ, శుభ్రమైన పాల ఉత్పత్తి పద్ధతులపై విలువైన సమాచారాన్ని రైతులకు అందజేస్తున్నామన్నారు.

పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను ప్రోత్సహించడానికి అమెరికాకు చెందిన 'టెక్నో సెర్వ్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నామని, ఆ సంస్థ భాగస్వామ్యంతో పశు, రైతుల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఆమె సమక్షంలో హెరిటేజ్, టెక్నో సెర్వ్ సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఆమె రూ.183.5 లక్షల రుణ చెక్కును పాడి రైతులకు అందజేశారు. పలు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల కుటుంబాలకు రూ.21.45 లక్షల చెక్కులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది మహిళా ఏజెంట్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సీవోవో సాంబమూర్తి, పాలసేకరణ విభాగం అధిపతి రామ్మోహన్ రావు, హెరిటేజ్ సంస్థ ఉన్నతాధికారులు గోపాలకృష్ణ, సర్వోత్తమ రెడ్డి, దామోదర్ నాయుడు, 'టెక్నో సెర్వ్' సంస్థ ప్రతినిధులు జయదీప్ దత్తా, వీఎస్ రామకృష్ణ, చంద్రశేఖర రావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం వెంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సెల్వరాజ్ పాల్గొన్నారు.

తగ్గేదేలే...



- బద్వేలులో జోరుగా గంజాయి విక్రయాలు
- నెల్లూరు- ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి దిగుమతి
- నియోజకవర్గ వ్యాప్తంగా సరఫరా
- నామమాత్రంగా పోలీసు దాడులు

బద్వేలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది గ్యాంగ్‌లా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడకు గంజాయి తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ గంజాయి దొరుకుతుండటంతో యువత బానిసలుగా మారుతున్నారు. కొందరు కూలీనాలీ చేసుకునే వారు గంజాయి పీల్చుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

గత జగన్ ప్రభుత్వంలో గంజాయి మాఫియా రాజ్యమేలందంటారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు తమ ప్రభుత్వం ఏర్పాటు అయితే గంజాయి మాఫియా భరతం పడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు అయినా ఆచరణలో అమలు కాలేదు. ఇక పోలీసులు మాత్రం నామమాత్రపు దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటు న్నారు. దీంతో గంజాయి గ్యాంగ్ తగ్గేదేలేదు అన్నట్లు జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా సరఫరా

గంజాయి విక్రయాలు చేస్తున్న ఐదారుగురు బద్వేలు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. వీరు నెల్లూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాల నుంచి పెద్ద ఎత్తున బద్వేలుకు గంజాయి తీసుకు వచ్చి ఇక్కడ విక్రయించడంతోపాటు వారికున్న పరిచయాల ద్వారా నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా వీరంతా గంజాయి వ్యాపారం సాగిస్తూ వచ్చారు. వీరిలో ఇప్పుడు ఒకరిద్దరు లేకపోయినా మిగతావారు ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. బద్వేలు పట్టణంలోని శివాలయం పరిసర ప్రాంతాలలో గల చెట్లచాటున, మార్కెట్‌యార్డు ప్రాంతంలో, పోరుమామిళ్ల రోడ్డులోని మరో ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి పెద్ద మొత్తంలో బద్వేలుకు తెచ్చి పట్టణంలోని పలుచోట్ల వారి మనుషుల ద్వారా విక్రయించడం, లేదా నేరుగా వారే విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు కేజీలు, అరకేజీలు లెక్కన పంపిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

గంజాయి విక్రయాలకు సంబంధించి నాలుగు రోజుల క్రితం ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యక్తి ద్వారా గంజాయి వ్యాపారానికి సంబంధించిన కూపీ లాగుతున్నట్లు సమాచారం. బద్వేలు కేంద్రంగా ఎంతమంది వ్యాపారాలు సాగిస్తున్నారు.. ఎక్కడికి సరఫరా చేస్తున్నారు.. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే విషయాలపై ఆరా తీయడంతో పాటు గంజాయి విక్రేతలపై నిఘా ఉంచినట్లు సమాచారం.

మత్తులో యువత

గంజాయి యథేచ్ఛగా దొరుకుతుండడంతో కొందరు యువత బానిస లుగా మారుతున్నారు. వీరితోపాటు కూలీనాలి చేసుకునే కొందరు బానిసలై గంజాయి మత్తులో తూలుతున్నారు. గంజాయిని పొడిచేసి సిగరేట్‌లో ఉండే పొగాకు తొలగించి గంజాయిపొడి వేసి పీల్చుతారు. ఇంకొందరు చిన్న చిన్న ప్లాస్టిక్ సీసాలలో కూడా గంజాయికూర్చి వాటిద్వారా సేవిస్తున్నారు. దీంతో వీరంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్‌శాఖాధికారులు ప్రత్యేక దృష్టితో సారించి గంజాయి విక్రయాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై బద్వేలు సీఐ రాజగోపాల్‌ను వివరణ కోరగా.. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయంలో ఈడీ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన వేతనాల ప్రకారం కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. అందించే వేతనాల్లో భారీ వ్యత్యాసాలున్నాయన్నారు. కావున కాంట్రాక్టర్ల ద్వారా అందే వేతనాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. లేబర్ కమిషనర్ ఇచ్చిన ప్రకారం కార్మికులకు రావలసిన సెలవులు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు ఈఎస్ఐ కార్డులు కాంట్రాక్టర్ ద్వారా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్, స్టీఫెన్‌ఆంథోని, శ్రీనివాసులు, శివశంకర్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ప్రవీణ్‌కుమార్



కడప రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ బుధవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఆయన కడప కోర్టులో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. గతంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీగా, సీనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడే పనిచేశారు. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలం పెట్టించడంలో కృషి చేశారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హనుమంతు

కాశినాయన జనవరి 29 (ఆంధ్రజ్యోతి) బి.మఠం మండలం తోట్లపల్లె వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు తెలుగంగ ఎడమ కాలువలో పడిన రామయ్య అనే వ్యక్తి బుధవారం అంబవరం వద్ద శవమై కన్పించినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలీ మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి రామయ్య భార్య భర్తలు. వీరికి పిల్లలు లేరు. గత 20 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల నుంచి మఠం మండలం తోట్ల పల్లి సమీపంలోని అచలానంద ఆశ్రమంలో ఉంటున్నారు. మంగళవారం ఇరువురు కలిసి తెలుగంగ కాలువ వద్ద బట్టలు ఉతుక్కుంటుండగా ప్రమాదవశాత్తు రామయ్య కాలువలో జారి పడి.. నీటిలో కొట్టుకొచ్చి బుధవారం అంబవరం వద్ద కాలువలో శవమై కన్పించాడు. అతని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

- అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ



మాట్లాడుతున్న అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ

వేముల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అన్నారు. బుధవారం వేముల సభాభవనంలో గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ, అవగాహన కార్యక్రమం చేస్తున్న విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ వీఎస్‌పీ శివరామకృష్ణ, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, నాబార్డు డీడీఎం విహారి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, అరటి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ, కదిరి బాబురావు కళాశాల టీచింగ్ అసోసియేట్ అఖిల్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ అరటి పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు వివ రించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ చీనీ పంటలో బెలుకును ఎక్కువగా వాడకూడదని, నీటిని తగిన మోతాదులో పెట్టాలన్నారు. నాబార్డు డీడీఎం విహారి, శాస్త్రవేత్త రేష్మ మాట్లాడారు.

క్రీడా పోటీల్లో పశువైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థి సాయి తేజశ్వని క్రీడల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించిందని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో కళాశాల బాలికల జట్టు విజేతగా నిలిచిందన్నారు. బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల జట్లు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. బాలుర క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారెమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. సాంస్కృతిక విభాగంలో వివిధ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని తెలిపారు. నృత్యం, జానపద నృత్య ప్రదర్శనలలో సాహిత్య విభాగంలో పశువైద్య విద్యార్థులు బహుమతులను దక్కించుకున్నారని, క్విజ్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన 105 మంది విద్యార్థులను అభినందించారు. పశువైద్యులు హరిప్రియ, కల్యాణి, ఇందిర, చరిత, రాజకిశోర్, కల్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై విద్యుత్ దీపాల వెలుగులు



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న కొండాపురం పట్టణం

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పుణ్యమా అని కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. కొండాపురం పట్టణం గుండా వెళ్లే నేషన్ హైవే (ఎన్‌హెచ్-67) రహదారిపై మంగళవారం విద్యుత్ దీపాలను వెలిగించారు. ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవే పనుల్లో భాగంగా కొండాపురం పట్టణంలో విద్యుత్ దీపాలను అమర్చారు. రోడ్డుకు ఇరువైపులా 128 లైట్లను అమర్చారు. వీటిని మంగళవారం రాత్రి హైవే అధికారులు ప్రారంభించడంతో కొండాపురం పట్టణం విద్యుత్ దీపాలతో వెలిగిపోతోంది.

ఆకతాయిల నిప్పు... 200 మామిడి చెట్లు దగ్ధం

- రూ.10లక్షలు నష్టం



కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణ శివారు పరిధి బుగ్గవంక సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 200 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. బాధితుల వివరాల మేరకు.. సీకేదిన్నె మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ బుగ్గలపల్లెలోని తుమ్మలకుంట మహాలక్ష్మి, శివక్రిష్ణ, నాగలక్ష్మి, ఈశ్వర్‌లకు సంబంధించి సుమారు ఐదెకరాల పరిధిలో ఉన్న 200 మామిడి చెట్లు ఓ ఆకతాయి సిగరెట్ తాగి పారేయడంతో కాలిపోయాయి. ఘటనలో డ్రిప్ పరికరాలు, పైపులు పూర్తిగా పాడయ్యాయి. మామిడి చెట్లు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ స్థితిలో మామిడిచెట్లు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యాన అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి తమను ఆదుకోవాలని వారు కోరారు.

ముగ్గురు మట్కాబీటర్లు అరెస్టు

వల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గణేశ్‌పురం సమీపంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ తెలి పారు. మట్కా ఆడుతున్నారన్న సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి దాడులు చేసి గణేశ్‌పురంలో మూతబడిన పెట్రోలు బంకు వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.50,420 నగదు స్వాధీనం చేసుకొని పట్టుబడిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హాకీలో కడపకు ద్వితీయ స్థానం

- ముగిసిన ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన కడప జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్‌ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతల కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు హనీఫ్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్‌సాహిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాల కోసం అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ, సామాజిక వర్గాలకు చెందిన అర్హులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు.

ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. దరఖా స్తు ప్రక్రియ ముగిసిన వెంటనే స్థానిక ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తిస్తామన్నారు. మార్చి 9వ తేదీలోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవుతుందని వివరించారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం ఎప్పుడో...!

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- ప్రయాణికులు, స్థానిక ప్రజల ఇక్కట్లు

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ ప్రారం భం కోసం ప్రయాణీకులు ఎదురుచూపులు చూస్తున్నారు. బస్టాండ్ నిర్మాణం పూర్తై మూడు నెలలు గడస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బం దులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

వేంపల్లె పట్టణం చుట్టుపక్కల ఐదు మండలాలకు ప్రధాన కేంద్రం. అలాగే కడప, పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు పట్టణాలకు వేంపల్లె ద్వారా నిత్యం బస్సులు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో గత ప్రభుత్వంలో ప్రయాణీకుల సౌకర్యార్థం సుమారు రూ.2.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల సమ యంలో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇక్కడి టీడీపీ నాయకుల విన్నపం మేరకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలు రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. బస్టాండ్ పూర్తయి దాదాపు మూడు నెలలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస్టాం డ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే బస్సులు నిలుపు తుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఇక కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లను నిర్మించినప్ప టికీ అవి తెరకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. పూర్తైన బస్టాండ్‌ను త్వరగా ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఆదిశగా అధికారపార్టీ నాయ కులు, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.



వేంపల్లెలో పూర్తైన ఆర్టీసీ బస్టాండ్

ఫర్నీచర్ కోసమే జాప్యం

కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయింది. అయితే బస్టాండ్‌లో ప్రయా ణికులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్ అందు బాటులో లేదు. ఈవిషయం ఆలస్యంగా గుర్తించిన ఆర్టీసీ అధికారులు ఫర్నీచర్ కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. టెండర్ ద్వారా ఈ ఫర్నీచర్‌ను సమకూర్చుకోవాల్సి ఉంది. దీని కోసం బస్టాండ్ ప్రారంభా నికి ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.



ప్రారంభానికి నోచుకోకపోవడంతో బస్సుల రాకపోకలు లేక నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్



ఫర్నీచర్ లేక ఖాళీగా ఉన్న బస్టాండ్ లోపలి భాగం

సమస్య ఆర్ఎం దృష్టికి...

వేంపల్లెలో బస్టాండ్ నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోని విషయం ఆర్ఎం గోపాల్‌రెడ్డి దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా.. రూ.3లక్షల ఫర్నీచర్ కోసం ఉన్నతాధికారులకు కొటేషన్ పంపాం. త్వరలోనే ఫర్నీచర్‌ను బస్టాండ్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చి మంత్రి ద్వారా బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్ బాబు

కడప ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి రాజధానిలో చేపట్టే ఉద్యోగ నియామకాల్లో అన్ని జిల్లాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం రారా గ్రంథాలయంలో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ ఏపీలో జోనల్ వ్యవస్థ ఉందని రాజధాని అమరావతిని ఫ్రీజోన్ చేయడంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో సమాన అవకాశాలు వస్తాయన్నారు. దాదాపు రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, జనవరిలో క్యాలెండర్ ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసపుచ్చుతోందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.దస్తగిరి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్, కార్యనిర్వాహక కార్యదర్శి బ్రహ్మం, ఉపాధ్యక్షుడు శివనాగేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, శరత్, ప్రభాకర్, బలరాం నాయక్, ప్రదీప్ సంజీవ్, నాగార్జున, శ్రీను, శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టండి

కొత్త ఎస్పీని కలిసిన దళిత ఫోరం కన్వీనర్

కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ అశోక్‌కుమార్‌కు దళిత ఫోరం కన్వీనరు బూసిపాటి కిశోర్‌కుమార్ విన్నవించారు. ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

శాంతిభద్రతలను పరిరక్షించండి

కడప మారుతీనగర్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లగా పేట్రేగుతున్న అసాంఘిక శక్తుల పీచమణచి శాంతి భద్రతలను పరిరక్షించాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి మాట్లాడారు.

వరి కొనలు తుంచి నాటడంతో అధిక లాభాలు



వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కమలాపురం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి నాట్ల సమయంలో కొనలు తుంచి నాటితే అధిక లాభాలు వస్తాయని వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మీరాపురం, కమలాపురం గ్రామాల్లో నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పంట పొలాలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ వరి నాట్లు వేయనప్పుడు ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్లు వెడల్పుతో కాలిబాటలు తీయాలని సూచించారు. వరి నారు కొనలు తుంచి నాటడంతో కాండం తొలుచు పురుగు గుడ్డు దశను నివారించవచ్చని తెలిపారు. పొలం గట్లపైన కలుపు లేకుండా శుభ్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు శివ రంజని, ఇందిర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోనీ, గంగావతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘విస్తరణ’కు అనుమతులు ఇప్పిస్తాం

గండిరోడ్డు పనులు చేయకుంటే ప్రజలకు తీవ్ర అసౌకర్యం ● ఆంధ్రజ్యోతి కథనాన్ని పరిశీలించిన కలెక్టర్



గండిరోడ్డులో పెండింగ్ పనులపై కలెక్టర్‌కు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆర్‌అండ్‌బీ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాలుగురోడ్ల కూడలి గండిరోడ్డు నుంచి బైపాస్‌రోడ్డు వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, మురుగుకాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌తో సమావేశమై రోడ్డు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు చెబుతానని నిధులపై కాంట్రాక్టర్‌కు భరోసా ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ వేణుగోపాల్, ఆర్డీఓ చిన్నయ్య బుధవారం పెండింగ్ పనులు ఉన్న గండిరోడ్డును పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో గండిరోడ్డు విస్తరణ పనులకు రూ.10కోట్లు మంజూరవగా రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోయిన యజమానులకు రూ.18 కోట్లు పరిహారం ఇచ్చారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, అధికారులు వివరించారు. కేవలం మురుగుకాల్వ కొంత వరకే పూర్తయింది. ఎన్నికలు రావడంతో పనులు నిలిపివేశారన్నారు. నాలుగుశాతం పనులు మాత్రమే జరగడంతో పనులు రద్దు చేశారు. ప్రజల అవసరాల కోసం తిరిగి పనులు చేపట్టాలని బీటెక్ రవి కలెక్టర్‌ను కోరారు. రూ.18కోట్లు ఇళ్ల యజమానులకు పరిహారం ఇచ్చారని ఆర్‌అండ్‌బీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 8వ తేదీన ‘గండిరోడ్డు విస్తరణ పనులు ఉన్నట్లా లేనట్లా’ శీర్షికతో ప్రచురించిన కథనాన్ని కలెక్టర్‌కు బీటెక్ రవి, షబ్బీర్ చూపించగా ఆయన పరిశీలించారు. ప్రజల అసౌకర్యం గురించి ఆ కథనంలో ప్రస్తావించడంతో ఆయన పరిశీలించి రోడ్డు నిర్మాణానికి కచ్చితంగా నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బైపాస్‌రోడ్డు వరకు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంవత్సరానికి ఐదు నెలలు ముందుగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు లేకపోయినా రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు తమకు ఇష్టమొచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖాధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరించడాన్ని చూస్తుంటే వాటికి కొమ్ముకాస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు రాజేష్, అమర్ రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

ముస్లిం మైనార్టీ నేత ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలై ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిందని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటున్నా చంద్రబాబునాయుడు అప్పు చేస్తున్నాడని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతున్నాయన్నారు. వృద్ధుల పింఛను రూ.4వేలు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తారన్నారు. త్వరలో మిగతా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో అనేక కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని గుర్తు చేశారు. జగన్ పెట్టిన బకాయి రూ.1.40లక్షలు కోట్లు ఉన్నాయన్నారు.

నేడు మండల సమావేశం

వీరపునాయునిపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. సమావేశంలో తాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఐసీడీఎస్, పశువైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి వస్తున్నార న్నారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఇతర శాఖల అధికారులు హాజరవాలని కోరారు. ఎమ్మెల్యే కీర్తిపల్లెలో జరిగే నల్లనమ్మ వార్షికోత్సవ పూజల్లో పాల్గొంటారని మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

చిరుకార్మికుల కడుపు కొట్టొద్దు



ఐసీడీఎస్ సీడీపీఓ సునీతకు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నేతలు

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే కార్మికుల కడుపు కొట్టొద్దని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మంజుల, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ సునీతకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. వేంపల్లె, చక్రాయపేట మడలాల్లోని పలు అంగన్వాడీల్లో పనిచేస్తున్న సహాయకులను, ఉపాధి హామీ సిబ్బందిని రాజకీయాల ఒత్తిడితో తొలగించాలని ఒత్తిళ్లు చేస్తున్నారని, ఎవరు ఒత్తిడి చేసినా న్యాయంగా వ్యవహరించాలని వారు కోరారు. నోటీసులు ఇచ్చి బలవంతంగా తొలగిస్తామనే విధానానికి స్వస్తి పలకాలని, ఇలాంటి వేధింపులు పునరావృతమైతే పోరాటం చేస్తామన్నారు.

వీఆర్వో, సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

లింగాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలకు హాజరు కావడం లేదని పార్నపల్లె, బోనాల వీఆర్వోలు, సర్వేయర్లకు లింగాల ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. తాము రోజూ రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీసర్వేలో పాల్గొంటున్నా నోటీసులు జారీ చేయడంతో సర్వేయర్లు అందరు బోనాలలో జరుగుతున్న రీసర్వేలో పాల్గొనకుండా నిరసన వ్యక్తం చేశారు. దీంతో డివిజనల్ సర్వేయర్ ఆఫీసర్ హేమలత, లింగాల తహసీల్దార్ ఈశ్వరయ్య బోనాల చేరుకుని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయని వీఆర్వోలు, సర్వేయర్లు రీసర్వేలో ఖచ్చితంగా పాల్గొనాల్సిందేనని తెలిపారు. ఈ విషయంపై గురువారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఎంపీడీఓ షోకాజ్ నోటీసు జారీ చేయడంపై వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌యాదవ్ వీఆర్వోలకు, సర్వేయర్లకు మద్దతు ప్రకటించారు.

దేవునికడప ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ



గుడి నుంచి బయటికి వస్తున్న ఎస్పీ


కడప క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవుని కడప శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం సందర్శించారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 4న రథసప్తమి నాడు జరగనున్న రథోత్సవానికి పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రథోత్సవం జరిగే మార్గాన్ని కాలినడకన పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని చిన్నచౌకు సీఐ ఓబులేసుకు ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట చిన్నచౌకు ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డి, దేవదాయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్ ద్వారా రక్షణ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు

సికెదిన్నె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడడం ద్వారా రక్షణ పొందవచ్చని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి విజయబాస్కర్ సూచించారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం సందర్భంగా బుధవారం కడప హరిత హోటల్ నుంచి బైక్ ర్యాలీని కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె, మహావీర్‌సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా హరిత హోటల్ వరకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని, యువత వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడంతో ప్రమాదాలు సంభవిస్తాయని అది ఇతరులకు రోడ్డుపై ఇబ్బంది కలిగించడం, కుటుంబ సభ్యులకు కూడా ఆవేదన కలిగిస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీప్రసన్న, సీఐ జావీదు, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో స్పీడ్‌బ్రేకర్లు తొలగింపు



(కడప-ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం అశోక్‌నగర్‌లో నిర్వహించిన ‘అక్షరమే అండగా పరిష్కారమే అజెండా’ కార్యక్రమంలో స్పీడ్‌బ్రేకర్లతో కలుగుతున్న నష్టాలను చర్చావేదికలో స్థానికులు ప్రస్తావించారు. అత్యవసర సమయాల్లో పేషంట్లను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే స్పీడ్ బ్రేకర్లతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉందంటూ మొత్తుకున్నారు. కార్యక్రమానికి వచ్చిన చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సమావేశం ముగిసిన వెంటనే ఎక్స్‌కవేటరు తీసుకువచ్చి స్పీడ్‌బ్రేకర్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే కొన్నిటిని తొలగించడం సాధ్యపడలేదు. దీంతో బుధవారం సాయంత్రం రిగ్గర్ తీసుకువచ్చి స్పీడ్‌బ్రేకర్ల తొలగింపు మొదలుపెట్టారు. చర్చావేదికలో జనం ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడంతో అశోక్‌నగర్‌వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి శ్యామలాదేవి నవరాత్రులు

చెన్నూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి శ్యామలాదేవి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పుష్పగిరిరోడ్డులో గోపవరం సమీ పాన కొలువైన శ్యామలా దేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం నుంచి 9 రోజులు వైభవం గా నిర్వహిస్తున్నట్లు ఆల య అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు గురు వారం అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు, ప్రత్యేక అలంకరణ, కోలాటం, అన్న ప్రసాద వితరణ ఉంటుంద న్నారు. ఫిబ్రవరి 3నుంచి చెన్నూరు బెస్తకాలనీ, బుడ్డాయ పల్లె, గోపవరం, ఉప్పరపల్లెలో రోజు ఒక గ్రామంలో గ్రామో త్సవం ప్రత్యేక కోలాట కార్యక్రమం ఉంటుందన్నారు. 7న (9వ రోజు) అమ్మవారికి విశేష పూజలు ఉంటాయన్నారు.

ఘనంగా షాలేమా చర్చి వార్షికోత్సవం

కడప(వినాయకనగర్), జనవరి29(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాసాపేట కొత్త కొట్టాలలో కొత్తగా నిర్మించిన షాలేమా చర్చి మొదటి వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు దాసరి సుధాకర్, సువర్ణ ఆధ్వర్యంలో చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గుంతకల్ పాస్టర్ దాసరి ప్రసాద్, ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్, ఇల్లూరి సురేశ్, డీ. సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నియామకం

కడప(వినాయకనగర్), జనవరి29(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కొండూరు మల్లికార్జునను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2013 నుంచి ఏబీవీపీ కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. గతంలో పెనగలూరు మండల కన్వీనర్‌గా, రాజంపేట ఉపాధ్యక్షుడిగా, నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేశానన్నారు. తనను నమ్మి ఇచ్చిన పదవికి న్యాయం చేసి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతుంటానన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

వేంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, విలువలతో కష్టపడి చదువుకోవాలని జూనియర్ కళాశాలల ఆర్జేడీ రవి తెలిపారు. వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ల్యాబ్‌ల ఏర్పాటుకు కలెక్టర్‌తో మాట్లాడి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి రూ.15లక్షలు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం సీసీ కెమెరాలకు వివిధ సౌకర్యాల ఏర్పాటుకు ముందుకొచ్చిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మునిరెడ్డి, షబ్బీర్, రజనీకాంత్‌రెడ్డి, ఎస్టీయూ నేతలు నరసింహారెడ్డి, నారాయణ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి, డాక్టర్ కరీముల్లా, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

‘ఔట్‌సోర్సింగ్ వేతనాలు పెంచాలి’



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది


కడప ఎర్రముక్కపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని ఔట్‌సోర్సింగ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారు మాట్లాడుతూ కడప నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇస్తున్న వేతనం సరిపోక అప్పులు చేయాల్సి వస్తోందని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.13వేల జీతం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. నిత్యావసర సరుకులు పెరిగిపోయాయని చెప్పారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో 350 మంది ఔట్‌సోర్సింగ్ ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని చెప్పారు. శానిటేషన్ వర్కర్స్ ఇస్తున్న జీఓ ప్రకారం ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు కూడా జీతాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అజాముద్దీన్, ఎస్ఎండీ ఖాసీం, రామసుబ్బారెడ్డి, ఆనంద్ రమేష్, ఎస్వీ రమణ తదితర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

కడప కల్చరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): పుష్య బహుళ మౌని అమావాస్య సందర్భంగా కడప నగర రామకృష్ణనగర్‌లో వెలసిన శనీశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి చాలా విశేషమైన రోజును పురస్కరించుకుని అర్చకులు వారణాసి శ్రీధర్‌శర్మ సారథ్యంలో స్వామికి అష్టోత్తర శత ఘట తైలాభిషేకం గావించారు.

రిమాండ్ ఖైదీల సమస్యలపై జడ్జి ఆరా

జమ్మలమడుగు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్‌జైలును బుధవారం జిల్లా లీగల్‌సెల్ సెక్రటరి జడ్జి బాబా ఫక్రుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జడ్జి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. శుభ్రతపై ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే తెలుపాలన్నారు. జైలు రికార్డులు తనిఖీ చేసి అక్కడున్న సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డితో జడ్జి మాట్లాడారు. న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు, పాలాజీ రవి, లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య పాల్గొన్నారు.





రేపు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాలలో ఈనెల 31వ తేదీన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, కలశస్థాపన, గణపతి హోమం, నవగ్రహ, రుద్ర, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు 102 మంది ఆర్యవైశ్య కన్యకలు 102 పూల మొక్కలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో ఈనెల 31వ తేదీ శుక్రవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ శనివారం వరకు రెండు రోజులపాటు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం తెలిపారు. ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 31వ తేదీ తెల్లవారుజాము 5 గంటల నుంచి సుప్రభాతం, 102 గోత్రాలు అమ్మవారికి పట్టువస్త్రాలు, కలశాలతో సమర్పణ కార్యక్రమాలు జరుగును.

'కార్మికులు, కూలీలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలి'

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, కూలీలు, హమాలీలు, వలస కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ మంజూరు చేయాలని మహాజన రాష్ట్ర సమితి అధ్యక్షుడు వై. చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, కూలీలు ఏళ్ల తరబడి శ్రమకోర్చి పనిచేస్తున్నా వారి జీవితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలలక్షుమయ్యమాదిగ, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య, తులసి సేవా సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, రామసుబ్బయ్య, చిన్నయ్య, బాలకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన ఉచిత ఓపీ సేవలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సాయికుటీర్ రోడ్డులోని హరికిశోర్ న్యూరో ఫైన్ అండ్ ఈఎన్‌టీ కేర్ ఆస్పత్రి 5వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత ఓపీ సేవలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హరికిశోర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ ఉచిత ఓపీ సేవలతోపాటు 50 శాతం రాయితీతో రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేలం ద్వారా రూ.17.50లక్షలు ఆదాయం

రాజుపాలెం,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తలనీలాలు, టెంకాయలు, కొబ్బరిచిప్పలకు ఈవో రమణ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో తలనీలాలకు రూ.9.55 లక్షలు, టెంకాయల అంగడికి రూ.5.30లక్షలు , పూజా సామగ్రి రూ.2.25లక్షలు, కొబ్బరిచిప్పలకు 40వేలు వేలం పాడినట్లు తెలిపారు. 8.1.2025 నుంచి 28.1.2025 వరకు నిల్వ ఉంచిన తలనీలాలకు రూ.3800 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్, జీఎల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరి

ముద్దనూరు జనవరి29(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని ఇన్‌చార్జి ముద్దనూరు పశుసంవర్ధక శాఖ ఏడీ వాసాశ్రీనివాస తెలిపారు. మండల కేంద్రంలోని ముద్దనూరు, చెన్నారెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం పశువు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకా పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పరమేశ్వరి, సూర్యబాబు, నాగమయ్య పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

కలసపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) :పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు, దూడల పెంపకం, పశుగ్రాస పెంపకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వర్ రావు అన్నారు. కలసపాడు మండలంలో బుధవారం పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులకు డాక్టర్ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రామక్రిష్ణరెడ్డి పాల్గొని రైతులు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే రాచ్చెరువు నీటి సంఘం అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి పాల్గొని విజయవంతం చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పశు సంవర్ధక అసిస్టెంట్స్ గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ కాలుష్యంతో పంటలు నాశనం

● ఇళ్లలో, కళ్లలో దుమ్ముతో ఇబ్బందిపడుతున్నాం ● లబోదిబో మంటున్న రైతులు ● కంది, చీనీ, మామిడికి పూత రాక భారీగా నష్టం

ఎర్రగుంట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు నాశనమతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆర్టీపీపీ చిమ్నీల నుంచి టన్నుల కొద్దీ కాలుష్యం చుట్టుపక్కల గ్రామాలపై, పంట పొలాలపై భారీగా పడుతోంది. దీంతో పచ్చగా ఉండాల్సిన తోటలు, పంటలు తెల్లగా మారిపోతున్నాయి. ఈ కాలుష్యం వల్ల పూతకొచ్చిన కంది, చీనీ, నిమ్మ, మామిడితోటల్లో రాలిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో డబ్బులు వెచ్చించి తీరా కాపుకొచ్చిన పంటలు కళ్లముందే నాశనమౌతుంటే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిమ్నీ నుంచి దుమ్మును నియంత్రించాల్సిన యంత్రాలు సక్రమంగా పనిచేయడంలేదన్న విమర్శలున్నాయి. వీటిపై యాజమాన్యం శ్రద్ధ పెట్టడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

●రాత్రి పూట వచ్చే దుమ్ము మరీ భారీగా ఉంది. దీని వల్ల ఉదయానికల్లా ఇంటి ముంగిళ్లు తెల్లగా పేరుకుపోతున్నాయి. అనారోగ్యం పాలవతున్నామని ప్రజలు తీవ్ర ఇందోళన చెందుతున్నారు. చుట్టు పక్కల గ్రామాలపై వీటి ప్రభావం భారీగా ఉంది. కళ్లల్లో పడి మంటలు వస్తున్నాయి. అన్నం, నీరు కలుషిత మౌతున్నాయి. కలమల్ల, మేకలబాలాయపల్లె, సున్నపు రాళ్ల పల్లె ఇలా గ్రామాల్లో ఈ దుమ్ము ప్రభావం వుంది.





ఆర్టీపీపీ చిమ్నీల ద్వారా వస్తున్న పొగ, దుమ్ముతో తెల్లగా మారిన చీనీ చెట్లు. మొక్కలపై పేరుకుపోయిన దుమ్ము

● చీనీ చెట్ల పూత రాలుతోంది - ఎం.రమణారెడ్డి, సున్నపురాళ్లపల్లె.

పది ఎకరాల్లో చీని చెట్లను సాగుచేశాము. అయితే ఎకరాకు రూ.లక్ష ఖర్చుచేశాము. ఆర్టీపీపీ చిమ్నీ నుంచి వచ్చే దుమ్ము వల్ల కందిపంట పూత రాలిపోయింది. అలాగే చీనీ చెట్లు పూతకు రావడంలేదు. కాచిన కొద్ది మేరకు కూడా వెంటనే రాలిపోతోంది. 500చీనీ, 120 మామిడి, చెట్లతోపాటు వేరుశనగ పంట కూడా సాగుచేశాము. పూ త రాలడంతో పంట రాదు. దీని వల్ల భారీగా నష్ట పోతు న్నాము. అధికారులు వెంటనే స్పందించి ఆర్టీపీపీ చిమ్నీ నుంచి వచ్చే దుమ్మును ఆపి పంటలను కాపాడాలి.

టీడీపీ ప్రభుత్వంపై అప్పుల భారాన్ని వేసిన జగన్

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని టీడీపీ ప్రభుత్వం మీద వేసి వెళ్లిందని దీంతో ప్రజలు ఆశించిన మేరకు అభివృద్ధిని చేపట్టలేక పోతున్నదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి జగన్‌ప్రభుత్వ బకాయిలు ఈ ప్రభుత్వం రూ.22 వేల కోట్ల రూపాయలు చెల్లించిందన్నారు. ఏడాదికిరూ.71 వేల కోట్లు అసలు వడ్డీలను చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇది ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు. ఏది ఏమైనా చెప్పిన హామీలనునెరవేర్చడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,మంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చింపిరి అనిల్,కమాల్‌బాషా, మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డి, తలారి పుల్లయ్య, శివాలయం మాజీ చైర్మెన్ పల్లా శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉచిత వైద్యశిబిరం

అట్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఎస్.వెంకటాపురంలో బద్వేలు మల్టీస్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు పాలకొండ రాజశేఖర్ తెలిపారు. ఉచితంగా చికిత్స నిర్వహించి మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. డాక్టర్ సుమన్ చిన్నపిల్లల వైద్యనిపుణులు, డాక్టర్ సరస్వతి షుగరు వ్యాధి నిపుణులు, డాక్టర్ పవిత్రశ్రీ గర్భసంబంధిత వైద్యనిపుణులు, డాక్టర్ అరుణిత్‌షాజీ ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు వైద్యం అందిస్తారన్నారు.

విద్యుత్తు షాక్‌తో వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు సమీప పొలాల్లో బుధవారం నీటితడులు ఇచ్చేందుకు కూలి పనికి వెళ్లి విద్యుత్తు షాక్‌తో సి.సుబ్రమణ్యం (35) అనే వ్యక్తి మృతిచెందాడు. బోరు వద్ద నీటి తడులు ఇచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి మృతిచెందినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన జాబ్ మేళా

బద్వేలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగభూషణం కళాశాలలో నేడు ఫస్ట్ సోర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. అర్హత గల వారిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. జాబ్ మేళాకు 27 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు, కళాశాల పరిపాలనాధికారి రాచపూడి సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను రాచమల్లు ప్రోత్సహించలేదా : కాంగ్రెస్



మాట్లాడుతున్న నజీర్

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు నిలయమైన ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి క్రికెట్‌బెట్టింగ్, మట్కా, జూదాన్ని ప్రోత్సహించలేదా అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్ ప్రశ్నించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి రాచమల్లు వైసీపీ కౌన్సిలర్‌ను జనసేన పార్టీలోకి పంపారని పేర్కొన్నారు. ఆ కౌన్సిలర్‌ను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. కుందూ, పెన్నానదుల అనుసంధానాన్ని లింగారెడ్డితో కలిసి హైకోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని విమర్శించారు. కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధిని అడ్డుకున్నది రాచమల్లు కాదా అన్నారు.పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష, ఖాజాపీర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో బి, సి సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. బుధవారం ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు డీఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌సీసీ ఇన్స్పెక్టర్ దావీదు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

హైవే బాధితులను విచారించిన తహసీల్దారు

ముద్దనూరు జనవరి29(ఆంధ్రజ్యోతి): హైవేకి ఇళ్లను కోల్పోతున్న కమ్మవారిపల్లె బాధితులను బుధవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి విచారించారు. అందులో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రోడ్డుకు ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.ప్రభుత్వం నుంచి పరిహారం నెలలోపు అందుతుందన్నారు.వాటికి కావాల్సిన అన్ని రికార్డులు పంపడం జరిగిందన్నారు. బాధితులు పాల్గొన్నారు.

కాశినాయన ఆలయ సమస్యను పరిష్కరించండి



ఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

కాశినాయన జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాశినాయన ఆలయ సమస్యను పరిష్కరించాలని బుధవారం మండల టీడీపీ నేతలు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. కాగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్‌ను బుధవారం బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి,టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, బసిరెడ్డి రవీంద్రారెడ్డి కలిసి అభినందనలు తెలియజేశారు.

రహదారి భద్రతే జీవితానికి శ్రీరామ రక్ష

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహిం చారు.స్థానిక బైపాస్ రోడ్డులో కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐలు విద్యాసాగర్, హృషికేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో ర్యాలీలో సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మైలవరం..: రహదారి భద్రతే రహదారికి శ్రీరామ రక్ష అని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని మైలవరం, వేపరాల, దొమ్మరనంద్యాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: ప్రయాణికులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ దస్తగిరి సూచించారు. మండల కేంద్రంలోబుధవారం సీఐ దస్తగిరి, ఎస్‌ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.



కొండాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోరుమామిళ్ల..: రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం సాయంత్రం పోరుమా మిళ్లలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు,జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన ఆర్ఎంపీ రమేశ్ బుధవారం మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే బోధనం రమేశ్ (30) రామేశ్వరంలోని వసంతపేటలో ఆర్ఎంపీగా కొంతకాలంగా క్లినిక్ నడుపుతున్నాడు. రమేష్ మూడు నెలలుగా అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిద్ర సరిగా రావడం లేదని మాత్రలు మింగేవాడని తెలిపారు. ఈ క్రమంలో రమేశ్ సోదరుడు బుధవారం మధ్యాహ్నం వసంతపేటలోని క్లినిక్ వద్దకు వెళ్లగా రమేశ్ ఫ్యానుకు ఉరివేసుకున్నట్లు గుర్తించారు. అతన్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, అనారోగ్య కారణాలతో రమేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు అతని సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమేరకు ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంపంగి పూలతోటలకు వింత వైరస్

ఖాజీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తే తీరాచేతికొచ్చే సమయంలో ఏదో ఒక రూపంలో రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా వచ్చాయి సంపంగి తోటలు సాగు చేస్తే నాలుగు రూకలు వస్తాయని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. మండల పరిధిలో వందల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పూలతోటలు ఆశాజనకంగా ఉన్నా తీరా కోతకు వచ్చేసరికి పూలకు వైరస్ వచ్చిందో, తెగుళ్ల వచ్చాయో తెలియక ప్రైవేటు కంపెనీ వారిని ఆశ్రయిస్తే వారు ఇచ్చిన మందులు పిచికారీ చేసినా లాభం లేదు. మరో కంపెనీవారు మా మందులు పిచికారీ చేస్తే దిగుబడి అధికంగా వస్తుందని చెప్పడంతో ఆ మందులు పిచికారీ చేసి డబ్బులు పోగొట్టుకోవడం తప్ప లాభం లేదన్నారు. కాగా మండల పరిధిలో పొలం పిలుస్తోంది అన్న కార్యక్రమాలు జరుగుతున్నాయి తప్ప అందులో ఉద్యానశాఖ అధికారులను ఎప్పుడూ మేము చూడలేదని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధికారులు మండల పరిధిలో ఉంటే వారిని సంప్రదించవచ్చని లేదంటే ప్రైవేటు కంపెనీవారు చెప్పిన మందులు పిచికారీ చేసి నష్టపోతున్నామన్నారు. ఉన్నతాధికారులుఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు అధికారులను అందుబాటులో ఉంచాలి.



సాగు చేసిన సంపంగి తోట, ఎండిపోతున్న పూలు